


# సత్యం

భమిడి వెంకటేశ్వర్లు

సత్యం ప్రవర్తన నా కేమీ నచ్చటం లేదు. ఇప్పటికి ఎన్నోసార్లు చెప్పాను. కాని వింటేనా! కుక్క తోకను సరి చేయవచ్చు. పాలకులు, నాయకులు ప్రజలను సరిగ్గా అర్థం చేసుకుని నీతి నిజాయితీలకు కట్టుబడి ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలను అమలుపరచాలనే ఆలోచనకు అంకురార్పణ చేయవచ్చు. కాని సత్యం విషయంలో ఏం చేయాలో అర్థం కావటం లేదు నాకు. ఇరవై ఏళ్ళ సత్యం నా డెబ్బయ్యేళ్ళ వయసుకు పోటీగా నిలుస్తున్నాడు. మంచికి పోతే ఫలితం ఇదా! ఉపకారానికి మిగిలేది ఇదా! ఏదీ కాక నా స్వయంకృతమా!

మంచం మీద మూలుగుతూ పడుకుంది కామాక్షి. "ఏం పడుకున్నావు? ఒంట్లో బాగుండ లేదా? డాక్టరు దగ్గరకు వెడదామా!" అని అడిగాను.

"ఏం వద్దు లెండి! రెండు సారిడాన్ మాత్రలు వేసుకున్నాను. అదే తగ్గుతుంది" అంది కామాక్షి దుప్పటి కప్పుకుంటూ.

"అయినా, ఆ వెధవకు పొద్దున్నే లేచి వంట చేయమని ఎవరు చెప్పారు. వాడి కంపెనీలో కాంటీను ఉందిగా. అక్కడ కాఫీ, టిఫిను తక్కువ ధరకు సప్లయ్ చేస్తారు. పైగా భోజనం రూపాయే! ఆ మాత్రం బుద్ధి, జ్ఞానం వాడికి ఉండక్కర్లేదూ! అయిదింటికి లేచి స్నానం చేసి వంట చేయటం అంటే మాటలా ఈ వయసులో. ప్రతివాడూ ఎదుటి వారి నుంచి ఆశించేవాడే, చేయించుకునేవాడే!" నాకు విసుగు, కోపం వచ్చింది.

"ఆ విషయం వాడికి మాత్రం తెలీదా! ఇరవై ఏళ్ళు దాటాయి. పెళ్ళి చేస్తే నలుగురు పిల్లలు పుట్టేవారు. ఇప్పటికి కొన్ని వందల సార్లు చెప్పాను. మంచం కింద విడిచిన బట్టలు పెట్టొద్దని, ఎలకలు కొట్టేస్తాయని. ఉతికి పెట్లో పెట్టుకోవచ్చుగా" అంది కామాక్షి లేచేందుకు ప్రయత్నిస్తూ.

"అసలు వాడిని కాదు, నిన్ను అనాలి. నిన్ను వాడి బట్టలు ఎవరు ఉతకమన్నారు. ఇక పైన వాడి కోసం నువ్వు పొద్దున్నే లేవడం, వంట చేయడం మానేసేయ్" అంటూ సైకిలు కోసం నడిచాను.


సైకిలు వైపు పరీక్షగా చూశాను. అది నాది కాదు. సత్యంది. "వాడు సైకిలు తీసుకెళ్ళ లేదా ఇవాళ" అని కామాక్షిని అడిగాను.

"సత్యం మీ సైకిలు తీసుకెళ్ళాడు. వాడి సైకిలుకి పెడల్ విరిగిపోయిందట. టైరు పాడైపోయిందట! వాడికి మీరు డొక్కు సైకిలు కొనిచ్చారట! అందుకే మీ సైకిలు తీసుకు వెళ్ళాడు" అంది కామాక్షి లేచేందుకు ప్రయత్నిస్తూ.

సత్యానికి నిర్లక్ష్యం, అజాగ్రత్త ఎక్కువ. వస్తువులని జాగ్రత్తపరచుకోవడంలో అశ్రద్ధ. వాడు ఇంటర్ తప్పాడు. మూడు నాలుగుసార్లు రాసి మానేశాడు. చదువు అబ్బలేదు. చిన్నప్పటి నుంచి అల్లరి చిల్లరగా తిరిగాడు. సినిమాలు, షికార్లు అంటే వాడికి మరింత ఆసక్తి. ఏడాది నుంచి మా ఇంట్లోనే ఉంటున్నాడు. వాడు నాకు మేనల్లుడు. మా చెల్లెలి కొడుకు. ఏడాది క్రితం మా చెల్లెలు ఉత్తరం రాసింది - "అన్నయ్యా! మేమూ, మా పెద్దమ్మాయి పెళ్ళి చేసి అప్పుల్లో పడిపోతూ. ప్రస్తుతం ఎన్నో ఇబ్బందులు, బాధలు పడుతున్నాం. యాభై వేలు ఖర్చు చేసి అమ్మాయి పెళ్ళి చేసినా సుఖమూ, శాంతి, తృప్తి లేదు. మీ బావగారి వ్యాపారం కూడా అంతంత మాత్రంగానే ఉంది. పట్నంలో ఖర్చులు ఎక్కువని ఇక్కడ కొచ్చినా పరిస్థితి మామూలే. లంక మేత గోదావ రీత లాగుంది ఆయన పరిస్థితి. ఊరు మారినా మా బతుకులు మామూలే. మనశ్శాంతి కరువైపోతోంది. మా కర్మ ఇలా ఉంది. వ్యాపారంలో పోటీ పెరిగిపోయింది. అది తట్టుకునేందుకు ఇంకా పెట్టుబడి పెట్టాలి. కాబట్టి వ్యాపారం సక్రమంగా నడవటంలేదు. మా మావగారు కూడా మా మీద చిన్న చూపు చూస్తున్నారు. మిగిలిన కొడుకు లంటేనే ఆయనకు ప్రేమ, అభిమానం, గౌరవం, నమ్మకంగానూ తోస్తుంది. ఈ పరిస్థితుల్లో నువ్వే మమ్మల్ని ఆదుకోవాలి. అమ్మా, నాన్నా లేకపోయినా, వాళ్ళున్నప్పుడు నేను ఏమంత సుఖపడ్డానో నీకు తెలిసినా, తెలియకపోయినా, ఈ పరిస్థితిలో మాకు అయిదు వేలు సాయం చేయమని కోరితే లే దన్నావు. ఏం చేస్తాం కనీసం మా సత్యాన్ని నీ దగ్గరుంచుకుని అక్కడ ఏదైనా కంపెనీలో ఉద్యోగం వేయించు. ఇక రెండోవాడు తొమ్మిదో క్లాసులో కొచ్చాడు. నీ ఉత్తరం కోసం ఎదురు చూస్తున్నాను" అంటూ.

ఉత్తరానికి రెండో వైపు మా బావ ఇలా రాశాడు -

"బావ గారికి నమస్కారములు. నా పరిస్థితి ఎక్కువగా రాసి మిమ్మల్ని బాధపెట్టలేను. నే నిప్పుడు ఊబిలో ఉన్నాను. సంపాదన లేదు. అప్పులు, ఖర్చులు, సమస్యల్లో ఉన్నాను. కన్న తండ్రే ఆదుకోనప్పుడు, నా సోదరులు మాత్రం ఎలా ఆదుకుంటారు? నేను నమ్మిన దేవుళ్ళకి చెవుడొచ్చిం దేమో! విధి ఆడుతున్న ఈ జీవిత నాటకంలో నేను నిలబడలేకపోతున్నాను. దయ చేసి నన్ను మమ్మల్ని అర్థం చేసుకుని ఈ పరిస్థితిలో మా సత్యాన్ని మీ దగ్గర ఉంచుకోండి" అంటూ.




అప్పుడు సత్యం మా ఇంటికి వచ్చాడు. ఓ రెండు నెలలు ఖాళీగానే ఉన్నాడు. ఆ తరువాత ఓ కంపెనీలో తాత్కాలికంగా ఎనిమి దొందల జీతం మీద చేర్పించాను. ఆ కంపెనీ పది కిలోమీటర్ల దూరంలో ఉంది. రోజూ పొద్దున్నే ఆరింటికి బయలుదేరితే గానీ ఎనిమిది గంటలకు చేరలేడు. రెండు బస్సులు మారి వెళ్ళాలి. దానికి తోడు శ్రమ, ఖర్చు!

"మీ నాన్న సైకిలు తెచ్చుకో" అన్నాను వాడితో.

"ఆ సైకిలు హైదరాబాద్ రోడ్ల మీద నడవదు" అన్నాడు సత్యం.

"ఎందుకని? సైకిలుకి కూడా ప్రాంతీయ భేదం ఉందా?"

"అది డొక్కు సైకిలు. రాముడు అయోధ్యను పాలించిన కాలంనాటిది. దానికి టైర్లు, పార్టులు అరిగిపోయాయి."

సత్యం మాటలు, తెలివితేటలు నాకు ఆశ్చర్యం కలిగించాయి.

"బాగు చేయించుకుంటే సరి" అన్నాను.

"ఆ ఖర్చుతో కొత్త సైకిలే వస్తుంది" అన్నాడు సత్యం.

"మరి ఆ సైకిలు ఇంట్లో దేనికి? పూజిస్తున్నాడా మీ నాన్న" అన్నాను చిరాగ్గా.

"వెళ్ళి కనుక్కొస్తాను. దారి ఖర్చులకు ఓ రెండొందలు ఇయ్యి" అన్నాడు చటుక్కున.

మరోసారి ఆశ్చర్యపోయాను. అప్పుడు అయిదొందలు పెట్టి ఓ పాత సైకిలు కొనిచ్చాను వాడికి. అయితే సత్యంలోని అశ్రద్ధ, నిర్లక్ష్యం కారణంగా ఆ సైకిలు ఎన్నో రోజులు రోడ్ల మీద నడవలేదు - రోజూ పంచర్లు, రిపేర్ల కారణంగా.

"ఇలాగైతే లాభం లేదురా" అన్నాను చాలాసార్లు.

"పాత సైకిలు అంతే మరి!" అన్నాడు సత్యం.

"చూడు బాబూ! జాగ్రత్త లేకపోతే ఏదైనా అంతే! ఇలా అయితే ఎలా? నీ కొచ్చే జీతంలో ఆరొందలు మీ నాన్నకు పంపిస్తే, వంద రూపాయలు సైకిలు రిపేర్లకు, మిగిలిన వందతో సాదరు అయితే ఎలా? పైగా నా ఇంట్లో నీకు ఉచితంగా నివాసం, తిండీ! అది చాలక నా దగ్గర తిరిగి ఇవ్వని చేబదుళ్ళు. మీ నాన్న నలభై వేలదాకా అప్పు చేశాడు. ఎలా తీరుస్తాడో?" అన్నాను.

"నేనే తీరుస్తాను" అన్నాడు సత్యం.

నాకు నవ్వొచ్చింది. "ఎలా?" అని అడిగాను.

"పెళ్ళి చేసుకుని."

"పెళ్ళయితే మీ నాన్న అప్పు ను వ్వేలా తీరుస్తావు? మీ ఆవిడ ఒప్పుకోదు" అన్నాను.

"పాతిక, ముప్పయ్ వేలు కట్నం తీసుకుని కొంత బాకీ తీర్చేస్తాను. మిగిలినది మా తమ్ముడి పెళ్ళి కొచ్చే కట్నంతో" అన్నాడు సత్యం ఎంతో గర్వంగా, హుందాగా.

"అంటే, పెళ్ళి చేసుకోవడం కేవలం అప్పులు తీర్చుకునేందుకేనా?"

"మ రెందుకు? నీకు తెలుసో, తెలియదో - ఈ రోజుల్లో చాలామంది వరుళ్ళు పెళ్ళి వాయిదా వేసుకుంటూ, ముప్పయ్ ఏళ్ళు దాటాకగానీ పుస్తె కట్టేందుకు అంగీకరించటం లేదు. ఎందుకో తెలుసా?" అన్నాడు వాడు.

"ఎందుకు?"

"కట్నం, లాంఛనాలు, బహుమతుల కోసం. పాత చింతకాయ, ఉసిరికాయ పచ్చళ్ళు భలే రుచిగా, మజాగా ఉంటాయి."

"బెండకాయలు లేతగా ఉంటే కూరకైనా, వేపడానికైనా బాగుంటాయి. ముదిరిపోతే సాంబారులోకైనా ఉపయోగపడవు. చెత్త కుండీలో పారేయాల్సిందే!"

"కానీ వరుళ్ళ విషయంలో అలా కాదు" అన్నాడు నిశ్చయంగా.

మా ఇంట్లో మాతోపాటు మా అబ్బాయి, కోడలు కూడా ఉంటున్నారు. "నీకు ఎన్నోసార్లు చెప్పాను వాళ్ళ గదిలో కెళ్ళొద్దని .... వాళ్ళ పౌడర్లూ, స్నో, తల నూనెలూ వాడొద్దని .. వాళ్ళ గదిలో ఉన్నప్పుడు వెళ్ళొద్దని" అని ఎన్నోసార్లు చెప్పాను కూడా.

"వెడితే ఏమైంది. పగలే కదా?" అనేవాడు సత్యం.

"పగలైనా, రాత్రి అయినా నీకు వాళ్ళ గదిలో కెళ్ళాల్సిన అవసరం ఏమిట్రా?" అని గట్టిగానే అడగాల్సి వచ్చేది.

సత్యం జవాబు బిరుసుగా ఉండేది.

వాడి ప్రవర్తన నాకూ, కామాక్షికీ చికాకునీ, కోపాన్నీ కలిగించేవి. ఏదో స్పర్థలకు దారితీస్తాయనిపించేది. మా ఇంట్లో ఓ గదిలో ఓ కొత్త జంట కాపురం ఉంటోంది. ఆ అమ్మాయి అందంగా, చక్కగా, ఆకర్షణీయంగా ఉంటుంది. ఆమె భర్త ఏదో కంపెనీలో పని చేస్తున్నాడు. రాత్రి పది, పదకొండు గంటలకు గానీ ఇంటికి రాడు. సత్యం ఆరింటికల్లా ఇంటికొచ్చేసి పెళ్ళి కొడుకులా ముస్తాబై ఆ పిల్లతో బాతాఖానీ కొట్టేవాడు గంటల తరబడి నవ్వుతూ, వెటకారంగా. ఆమె కోసం ఏవో పత్రికలు తెచ్చి ఇచ్చేవాడు. కామాక్షి ఇ దంతా గమనించి నాతో చెప్పింది. నేనూ మూడు నాలుగు సార్లు గమనించారు.

"ఇ దేం పనిరా నీకు? ఆ అమ్మాయితో ఏమి టా ముచ్చట్లు?" అని రెండు మూడుసార్లు అడిగాను.

"మాట్లాడితే ఏమైంది?" అనేవాడు సత్యం.

"గంటల తరబడి మాట్లాడేందుకు ఏ ముంటాయి కబుర్లు. అయినా ఆ పిల్లకూ, నీకూ ఏమిటీ చుట్టరికం, సంబంధం?"

"మామయ్యా! ఏమిటి నీ చాదస్తం. నువ్వు భగవద్గీత, హెూమియోపతి పుస్తకాలు చదువుతూ ఉంటావు. అత్తయ్య వంటింట్లో ఉంటుంది. మీ అబ్బాయి, కోడలు గదిలో కూర్చుంటారు. ఇక నాకు కాలక్షేపం ఎలా? పడుకునే వరకూ ఏం చేయాలి?"

'అందుకని ఆ పిల్లకు సుత్తి వేస్తూ ఉంటావా? ఇంటరు తప్పావు కదా! మళ్ళీ పరీక్షకు కట్టి చదవవచ్చు కదా? లేదా టైపు, షార్టుహాండు నేర్చుకోవచ్చు కదా!"

కాని సత్యం నా మాటల్ని వినేవాడు కాదు.

వాడికి ఒంటరిగా ఉండాలన్న ఉద్దేశం బయటపడింది. కాని వాడి సంపాదనతో అది సాధ్యం కాదని సత్యానికి తెలుసు. ఈ నగరంలోనే సత్యానికి ఇద్దరు బాబాయిలు, ఓ పెదనాన్న ఉన్నారు. కానీ వాళ్ళు వాడిని రానివ్వరు. వాడితో మాట్లాడరు. ఎప్పుడైనా వెళ్ళినప్పుడు కాఫీ కాదు కదా కనీసం మంచినీళ్ళు కూడా ఇవ్వరు.

ఇలా ఉండగా, సత్యం పని చేస్తున్న కంపెనీలో అగ్నిప్రమాదం జరిగింది. దానితో చాలామందికి ఉద్యోగాలు పోయాయి. సత్యానికి ఈ నిరుద్యోగం మరింత హాయిగా ఉన్నట్లు తోచింది. పగలు కూడా ఆ అమ్మాయితో కబుర్లు చెప్పసాగాడు. నాకు ఇది నచ్చటం లేదు.

"నువ్వెళ్ళి మీ నాన్నకు సాయంగా ఉండు. ఇక్కడ మళ్ళీ ఏదైనా అవకాశం వస్తే వద్దువు కాని" అన్నాను ఓ రోజు.

"మామయ్యా! నే నిక్కడే ఉంటాను మీకు సాయంగా - ఇంట్లోకి వీధి కుళాయి నుంచి నీళ్ళు తెస్తూ! బజారు నుంచి కూరలు తెస్తాను. అత్తయ్యకూ, నీకూ మందులు తెస్తూ" అన్నాడు సత్యం.

వా డెందు కలా అంటున్నాడో నాకు తెలియకపోలేదు.

సత్యానికి తండ్రి నుంచి ఉత్తరం వచ్చింది వెంటనే బయలుదేరి రమ్మనమని. అయితే ఈ విషయం వాడు మరోలా అర్థం చేసుకుని

ప్రవర్తించసాగాడు - నేను రాయించినట్లుగా ఆ అమ్మాయి దగ్గర అన్నాడని తెలిసింది నాకు కామాక్షి ద్వారా.

"ఏమైనా నేను వెళ్ళను మామయ్యా! పైగా వెళ్ళేందుకు నా దగ్గర డబ్బు లేదు. దారి ఖర్చులకు రెండొందలు అవుతాయి. మా నాన్నకు డబ్బు లేకపోతే కోపం. ఓకాకు కదా! అందుకే ఇలా రాసి ఉంటాడు" అని మొండికేశాడు సత్యం.

దారి ఖర్చులకు వంద రూపాయలు ఇచ్చి పంపాను.

సత్యం వెళ్ళక తప్పలేదు.

** ** **

పదిహేను రోజుల తరువాత సత్యం తండ్రి ఉత్తరం రాశాడు. ఆత్రంగా చదివాను.

"బావగారికి,

మీరు చదువుకున్నవారు. అనుభవజ్ఞులు, సంస్కారులు, వివేకవంతులు అనుకున్నాను. కాని ఇటువంటి పనులు కూడా చేయగలరని ఆలస్యంగా తెలుసుకున్నాను.

"మీ చెల్లెలు పోరు పెడుతుంటే సత్యాన్ని మీ ఊరికి పంపాను. అది కూడా మీ అంగీకారంతోనే. వాడు మీ ఇంటి నౌకరా! వాడి చేత బట్టలు ఉతికించుకోడానికి, బజారు పనులు చేయించుకోడానికీ, వీధి కుళాయి నుంచి నీళ్ళు తెప్పించుకోడానికీ; మీ అబ్బాయిని శోభనపు పెళ్ళి కొడుకులా కూర్చోపెట్టి గాడిద చాకిరీ చేసేందుకేనా సత్యం మీ ఇంట్లో ఉన్నాది!

"సత్యం మీ సుపుత్రుడి దగ్గర రెండొందల తీసుకున్నాడని, అది అడిగితే మా వాడు ప్రస్తుతం లే దన్నాడనీ, మీరు పరోక్షంగా మీ సుపుత్రుడిని రెచ్చగొట్టి జబర్దస్తీగా కొట్టిస్తారా? మీ పెద్ద బుద్ధి ఇలా చేసేందుకు సిగ్గు పడటంలేదా? ఈ వయసులో ఇటువంటి పనులు ఏమిటి? ఇన్నాళ్ళూ మీ గురించి గొప్పగా ఊహించుకున్నాను. కానీ మీ రెంత చవకబారు మనుషులో తెలిసింది.

"మీ పుణ్యమా అని, ప్రస్తుతం సత్యం ఆసుపత్రిలో ఉన్నాడు. ఒంటి మీద గాయాలు మానేందుకు మరికొంత కాలం పట్టవచ్చు. వాడిని మీ ఇంట్లో ఉంచుకోవడం ఇష్టం లేకపోతే ముందే ముఖస్తంగా చెప్పవచ్చు కదా! తెరచాటుగా, చేతులకు మట్టి, తడి అంటకుండా చేయటం ఏమిటి? ఈ రాజకీయం ఎప్పట్నుంచి నేర్చుకున్నారు? ఇటువంటి సంఘటనలు కథల్లో చదివాను. సినిమాల్లో చూశాను. ఇప్పుడు మీ ద్వారా తెలిసింది. విస్తట్లో అన్నీ వడ్డించి, పక్కన ఉమ్మేయటం మీ విజ్ఞతకు ఓ గొప్ప నిదర్శనం అనుకోవాలేమో!" అంటూ.

ఉత్తరం కింద పడేశాను. నేను సత్యాన్ని మా ఇంట్లో ఉంచుక..పే మా చెల్లెలు ఏమీ చేయలేదు. బావగారిం భయపడి కాదు. ఇక్కడ సత్యం అప్పులు చేస్తున్నాడని. అడిగినవారికి ఏవో కథలు చెప్తున్నాడనీ నాకు తెలుసు. అందుకే పరోక్షంగా హెచ్చరిస్తూ వచ్చాను. అప్పు తీర్చకపోతే ఎవ రూరుకుంటారు? అసలు వాడికి అప్పు చేయవలసిన అవసరం ఏమిటి?

నాకు మరో విషయం కూడా తెలిసింది - సత్యం తన తల్లికి ఉత్తరం రాసేడట. తనకు ఇక్కడ ఉండటం ఇష్టం లేదని, అత్తయ్యా, మామయ్యా గాడిద చాకిరీ చేయించుకుంటున్నారని, ఏదో విషయంలో సాధిస్తున్నారని, నెలకు అయిదు వందలు ఇచ్చి ఉండమన్నా ననీ. నా తోబుట్టువే ఇలా భర్త చేత ఉత్తరం రాయిస్తే, ఇక నే నెవరికి, ఎందుకు ఉపకారం చేయాలి? వారి పరిస్థితికి జాలిపడి, మానవత్వంతో ఆలోచించి సత్యాన్ని నా ఇంట్లో ఉంచుకుని, ఉద్యోగం ఇప్పించిన నేరానికి నాకు బహుమానం అక్షింతలు.

సత్యం ఒంటికి తగిలిన గాయాల గురించి కూడా నాకు తెలిసింది కొద్ది రోజులకే - తొమ్మిది నెలల క్రితం సత్యం కంపెనీలో ఓ కొలీగ్ దగ్గర అయిదొందలు అప్పు చేశాడట అయిదు రూపాయల వడ్డీకి! అ దిపుడు వడ్డీతో కలిపి ఏడొందల పాతిక అయింది. ఆ కొలీగ్ అప్పు తీర్చమని అడిగితే, తా నేమీ అప్పు తీసుకోలేదని బుకాయించాడట! ఫలితంగా ఇద్దరి మధ్యా కొట్లాట ... ఆ గాయాలతో ఇంటి కెళ్ళిన సత్యం, తన తండ్రితో నేను కొట్టించానని చెప్పాడుట.

చదువుకునే వయసులో అల్లరి చిల్లరగా తిరగటం, చదువు పట్ల అశ్రద్ధ, నిర్లక్ష్యం చూపించటం, సరదాలు - కోరికలు తీర్చుకునేందుకు అందంగా అబద్ధాలు చెప్పటం, ఆ వలయం నుంచి బయటపడేందుకు ఎదుటివారిని కారకులుగా చిత్రించటం - సత్యంవంటి యువకుల్లో ఎక్కువగా కనిపిస్తోంది నేడు. వీరిలో ఈ ప్రవృత్తి, ధోరణి ఎప్పుడు మారుతుందో? కన్నవారిలో తమ పిల్లల్ని గమనించే శక్తి మమకారం చాటున బలైపోతోందో లేక సమర్థించుకోవాలని ఉబలాటమో తెలియటం లేదు.

ఇలా ఆలోచిస్తుంటే గదిలో అద్దెకుంటున్న అమ్మాయి వచ్చింది. ఆమె చేతిలో ఓ కవరు ఉంది. ఆమె కళ్ళ వెంబడి నీళ్ళు కారుతున్నాయి. కామాక్షి నా కా ఉత్తరం అందించింది.

అది సత్యం ఆ పిల్లకు రాసినది!

ఉత్తరం చదవసాగాను -

"డియర్ అందమైన అమ్మాయీ!

"నీ పేరు కంటే నువ్వే అందంగా ఉన్నావంట నీ ఛాతీ ఎంత ఎత్తుగా పెరుగుతుందో ఇక్కడ నుంచి గ్రహించలేనా? ఉద్యోగం లేకపోవటంతో నిన్ను విడిచి ఇక్కడకు రావలసి వచ్చింది. నిన్ను చూడక కళ్ళు కాయలు కాస్తున్నాయి. ఏమీ తినాలని లేదు. తినాలనిపించటం లేదు. మనసంతా నీ వైపే తిరుగుతోంది. నన్ను ఇక్కడికి పంపేయటానికి కారణం మా మామయ్యే! నేను త్వరలోనే నీ దగ్గర కొచ్చేస్తున్నాను. ఉద్యోగం లేకపోయినా, డబ్బు లేకపోయినా ఫరవాలేదు - ను వ్వెదురుగా ఉంటే చాలు, మాట్లాడితే చాలు. సెకన్లు, క్షణాలు, గంటలు, రోజులు ఇట్టే దొర్లిపోతాయి. నాకు నిన్ను చూస్తుంటే జాలి వేస్తోంది. పాపం! మీ ఆయన పొద్దున్నే వెళ్ళి రాత్రి ఎప్పుడో వస్తాడు. అప్పటికి నీకు ఆవులింతలు వచ్చేస్తాయి. నీ మొగుడితో నీకు తృప్తి, ఆనందం, సుఖం లేవని నాకు నీ మాటల ద్వారా తెలుస్తోంది. వీలైతే, నీ మొగుడికి - వాడు కట్టిన తాళి ఇచ్చేయ్! నేను మ రొకటి కట్టేస్తాను. నా దగ్గర నీకు ఎంతో హాయి, సుఖమూ, తృప్తి, ఆనందం కలుగుతాయి. మన మధ్య పార్కులు, షికార్లు, సినిమాలు, సరదాలు ఎన్నో ఉంటాయి. ఈ ఉత్తరం ద్వారా నా విరహాన్ని అర్థం చేసుకుంటా వనుకుంటున్నాను! జవాబు వెంటనే రాయి. నేను త్వరలోనే నీ దగ్గరకు వచ్చేస్తున్నాను. అంతవరకూ ఓపిక పట్టాలి మరి!

ఇక సెలవు

సత్యం."

ఉత్తరం చదివాక నాకు కళ్ళు బైర్లు కమ్మాయి. సత్యం తెగింపు, ధైర్యం, తెలివి తేటలు ఆశ్చర్యంలో పడేశాయి. వాడి ఉద్దేశం ఏమిటో మరి.

"చూడమ్మా! సత్యం తరపున నేను క్షమాపణలు కోరుతున్నాను. ను వ్వేమీ బాధపడద్దు. నేను వెళ్ళి సత్యం తండ్రితో మాట్లాడి వస్తాను. వాడి వల్ల నీకు ఏ ప్రమాదమూ ఉండదు. నిశ్చింతగా ఉండు" అని ధైర్యం చెప్పాను.

కామాక్షి ఆ పిల్లను ఓదార్చింది చాలాసేపు.

సత్యం తండ్రితో ఈ విషయాన్ని ఎలా చెప్పి పరిష్కరించాలా అని ఆలోచించసాగాను అప్పటి నుంచి.

★

